

















తిరునాళ్లకు బాలకోటేశ్వరాలయం ముస్తాబు


వడ్లమూడిలోని క్వారీ బాలకోటేశ్వరస్వామి

చేబ్రోలు: వందేళ్ల చరిత్ర కలిగిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు ముస్తాబైంది. నారాకోడూరు నుంచి తెనాలి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న బాలకోటేశ్వర స్వామి దేవాలయానికి చరిత్ర ఉంది. జిల్లాలో కోటప్పకొండ తరువాత క్వారీ తిరునాళ్ల ప్రసిద్ధి. జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్ష మంది వరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, చేబ్రోలు, సుద్దపల్లి, వడ్లమూడి, శలపాడు తదితర గ్రామాల నుంచి సుమారు 15 వరకు భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తాయి. వందల సంఖ్యలో చిన్న ప్రభలు వస్తాయి. మూడు రోజుల పాటు తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చేబ్రోలు, నారాకోడూరు, సుద్దపల్లి గ్రామాలకు చెందిన భారీ సెట్టింగ్ ప్రభలు ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. 50 నుంచి వంద అడుగుల ఎత్తులో భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు ఇక్కడ ప్రత్యేకత.

కోరిన భక్తుల కొంగుబంగారం పెదకాకాని శివక్షేత్రం

- మహా శివరాత్రి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు
- ఉత్సవాల నిర్వహణకు క్యూలైన్లు, పందిళ్లు

పెదకాకాని: కోరిన భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం. గుంటూరుకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్లు నిత్యం పూజలు అందుకుంటూ భక్తులు కోరిన కోర్కెలు నెరవేరడం, కోర్కెలు నెరవేరిన భక్తులు తిరిగి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈనెల 23వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు శివాలయంలో మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి మహా శివరాత్రి పర్వదినం రోజున వచ్చే వేలాది భక్తులకు త్వరతగతిన స్వామివారి దర్శనం అయ్యేలా భారీ క్యూలైన్‌లు అమర్చి బ్రహ్మోత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం ప్రాంగణం అంతా రంగు రంగుల పందిళ్లతో కళకళలాడుతోంది. క్యూలైన్లలో భక్తులకు వాటర్‌బాటిళ్లు, పాలు, మజ్జిగ ఉచితంగా అందజేయడంతో పాటు నిత్య అన్నదానం, నిత్య ప్రసాదపంపిణీ జరుగుతుందని ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

పెదకాకాని శివాలయం ప్రత్యేకతలు..

పెదకాకాని శివాలయంలో యజ్ఞాల బావి నీటితో స్నానాలు, ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడం, అంత్రాలయ అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, తలనీలాలు, అన్నప్రాసనలు, చెవిపోగులు కుట్టించుట, వాహన పూజలు, ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా రాష్ట్రంలోనే ప్రత్యేకంగా చెప్పుకోదగిన రాహుకేతువు పూజలు అత్యంత ప్రాచుర్యం పొందినవి. ప్రతి నిత్యం నవగ్రహపూజలు, దేవస్థాన యాగశాల నందు గణపతి హోమం, నవగ్రహ హోమం, నిత్య రుద్ర హోమములు, సుబ్రహ్మణ్య, చండీ హోమములు, పాశుపత హోమములు, శాంతి కల్యాణం జరుపుట ద్వారా సకల దోష నివారణ, సర్వకార్యసిద్ధి కలుగుతుందని ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పేర్కొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు


విద్యుత్ దీపాలంకరణలో ఆరెమండలోని సంగమేశ్వరస్వామి ఆలయం


ప్రత్యేక అలంకరణలో సంగమేశ్వరస్వామి



ఏర్పాటైన భారీ ప్రభ


కట్టెంపూడి ఆలయంలో పూజలు

పొన్నూరు: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పొన్నూరులోని శివాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే స్వామికి విశేష అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో షామియానాలు, తాగునీరు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో భారీ ప్రభలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆరెమండ గ్రామంలో వేంచేసియున్న శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మేనేజరు మల్లెల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా చేశారు. కట్టెంపూడిలోని భ్రమరాంబ సమేత సుందర మల్లికార్జున స్వామి ఆలయంలో అధ్యక్షులు వడాలశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి వేంపాటి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.



































తాజా వార్తల కోసం
లాగాన్ అవ్వండి
www.sakshi.com